# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 125 | విశాఖపట్నం | 5-2-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 125 | VISAKHAPATNAM | 5-2-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram









# అవినీతి, అహంకారం దోపిడీ, దుర్మార్గానికి 'కేరాఫ్ అడ్రస్'

# అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్‌కు నూకలు చెల్లాయి...ఈరోజుతో

# పోస్టింగ్ లేదు అమరావతి మెయిన్ ఆఫీస్‌కి అటాచ్...

- ఔషధ నియంత్రణ శాఖలో ఇంచార్జ్ 'అసిస్టెంట్ డైరెక్టర్‌గా 'డిప్యూటీ డైరెక్టర్ రజిత బాధ్యతలు
- అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్‌కి విశాఖతో బంధం తెగిపోయే...
- వేలాదిమంది శాపాలుతో విజయ్ కుమార్ పోయే!!!
- అసిస్టెంట్ డైరెక్టర్ అరాచకాలకు చెక్ పెట్టిన ప్రభుత్వం
- అవినీతి, అహంకారంతో ఔషధ నియంత్రణ శాఖను భ్రష్టు పట్టించిన విజయకుమార్
- వేలాది మంది ఫార్మసిస్టులు ఏడుపులు ఈరోజుతో పోయే
- ఊపిరి పీల్చుకున్న తోటి ఉద్యోగులు!!
- పతాకం న్యూస్ దెబ్బకు ఔషధ నియంత్రణ శాఖ అవినీతి అధికారికి చెక్ పెట్టిన ప్రభుత్వం..
- పూర్వం రోజులు రాబోతున్నాయి అంటూ హర్షం వ్యక్తం చేస్తున్న మెడికల్ షాప్ యజమానులు



PROCEEDINGS OF THE DIRECTOR GENERAL::DRUGS AND COPYRIGHTS:: DRUGS CONTROL ADMINISTRATION::SMC CAMPUS::VIJAYAWADA-520 008,

Present: Director General (I/C)
Drugs and Copyrights
Drugs Control Administration, A.P.

Proc.No.:31277/Estt/2026 Date:03-02-2026

Sub: Drugs Control Administration - Establishment - Attachment of Sri S. Vijaya Kumar, Assistant Director & District Sales Licensing Authority, Visakhapatnam to Head Office, Vijayawada-Handing over charge to the Deputy Director, Visakhapatnam - Orders - Issued - Regarding.

Ref: Instructions received from the Secretariat on 03.02.2026.

ORDER:

In the interest of administration and for effective functioning of the department, Sri S. Vijaya Kumar, Assistant Director & District Sales Licensing Authority, Drugs Control Administration, Visakhapatnam, is here by attached to the Head Office of the Drugs Control Administration, Vijayawada with immediate effect, on administrative grounds, until further orders.

The said officer shall immediately hand over charge of the post of Assistant Director & District Sales Licensing Authority, Visakhapatnam to Smt. K. Rajitha, Deputy Director, Drugs Control Administration, Visakhapatnam.

Sri S. Vijaya Kumar, Assistant Director & District Sales Licensing Authority, Visakhapatnam is directed to report to the Office of the Director General, Drugs and Copyrights, Drugs Control Administration, Vijayawada forthwith and perform duties as assigned by the competent authority.

Smt. K. Rajitha, Deputy Director, Drugs Control Administration, Visakhapatnam, shall be kept Full Additional Charge of the post of the Assistant Director & District Sales Licensing Authority, Visakhapatnam to ensure that no disruption occurs in the day-to-day administrative and statutory functions of the office.

This order shall take effect immediately.

Director General(I/C)
Drugs and Copyrights

To:
Sri S. Vijaya Kumar, Assistant Director, District Sales Licensing Authority, DCA, Visakhapatnam.

Copy to:
1. Smt. K. Rajitha, Deputy Director,DCA,Visakhapatnam
2. The Joint Director, DCA,Visakhapatnam.

Digitally signed by
SAURABH GAUR
Date: 03-02-2026
21:11:39

**అమరావతి, పతాకం న్యూస్:** విశాఖపట్నం ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అవినీతి అహంకారానికి నూకలు చెల్లాయి అని చెప్పవచ్చు.. వేలాది మంది ఫార్మసిస్టులను ఇబ్బందులు గురి చేస్తూ ప్రతి చిన్న దానికి కొర్రీలు పెడుతూ ఒకపక్క ఫార్మసిస్ట్ లు మరియు మెడికల్ షాపు యజమానులను తిప్పిస్తూ నెలలు తొరబడి లైసెన్సులు ఇవ్వకుండా లక్షలాది రూపాయలు రెంటల్ కట్టలేక ఇబ్బందులు గురైనటువంటి సంఘటనలు చాలా ఉన్నాయి.. అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ తీరే వేరు ఆన్లైన్ విధానం వచ్చిన తర్వాత కూడా ఏదో ఒక చిన్న సాకులు చూపిస్తూ కొర్రీలు పెడుతూ డ్రగ్ ఇన్స్పెక్టర్లకి, తెలియకుండా మెడికల్ షాప్ యజమానుల్ని మరియు ఫార్మసిస్టులుని ఆఫీస్ కి తెప్పించుకొని అవినీతికి అహంకారానికి తావు లేకుండా డబ్బులు దోచుకునే వారిని తెలిసిన విషయమే! ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే మెడిసిన్ తీసుకొని అమ్ముకునేవాడని అభియోగాలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలోని కొన్ని వందల షాపులకి లైసెన్స్ ఇవ్వకుండా కోర్రీలు పెట్టారని పూర్తిగా సమాచారం. అలాగే విశాఖపట్నం జిల్లాలో గాజువాక ప్రాంతంలో కొన్ని వందల షాపులకి లైసెన్సులు జారీ చేయకుండా ఎగనామం పెట్టి, డబ్బులు ఒక్క పక్క మెడిసిన్ తీసుకొని లైసెన్సులు జారీ చేయకుండా తిప్పించుకునేవారని గాజువాక లో ఉన్న ఫారంసిస్టు యజమానులు గగ్గోలు పెట్టిన సందర్భాలు లేక పోలేదు. గాజువాక లో బాలాజీ మెడికల్ యజమాని దగ్గర డబ్బులు లేకపోతే 25 వేల ఖరీదైన మెడిసిన్ తీసుకొని రెన్యువల్ లైసెన్స్ జారీ చేశారని అభియోగాలు లేకపోలేదు! ఆసుపత్రి పెట్టుకున్న యజమానులుకి ఔషధ నియంత్రణ శాఖలో డ్రగ్ లైసెన్స్ జారీ చేయాలంటే లక్ష రూపాయలు కొట్టాల్సిందే,కొర్రీలు మీద కొర్రీ లు పెట్టి తిప్పించుకునేవారని యజమానులు గగ్గోలు పెడితు ఏడుస్తున్న సందర్భాలు చాలా ఉన్నాయి. మెడికల్ షాప్ యజమానులతో పరిచయాలు పెంచుకొని అప్పురూపంలో డబ్బులు తీసుకోనీ తిరిగి యజమానులు డబ్బులు అడిగితే లైసెన్సులు రద్దు చేస్తాను అని బెదిరించే వారిని యజమానులు చెప్పుకున్న సందర్భాలు లేకపోలేదు!! అస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ తో పని చేసిన డ్రగ్ అధికారులు మరియు పై అధికారి డిప్యూటీ డైరెక్టర్, మరియు జాయింట్ డైరెక్టర్ మహిళా అధికారులని వేధింపులకు గురి చేశారని అభియోగాలు కూడా ఉన్నాయి! ఒకట, రెండా వేలాదిమంది ఫార్మసిస్టుల్ని తోటి ఉద్యోగస్తుల్ని ఇబ్బందులకు గురిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ కి విశాఖపట్నం జిల్లాతో ఈరోజు నుంచి నూకల చెల్లాయి అని సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం... విశాఖ జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమారు అవినీతి అహంకారానికి విశాఖ జిల్లా నుంచి అమరావతికి అటాచ్ చేసినట్టు ఆర్డర్ వచ్చినట్టు తెలుస్తుంది పోస్టింగ్ పెండింగ్లో పెట్టినట్టు సమాచారం.

## పెద్దపులిని పట్టుకునేందుకు 12 టీంలు సిద్ధం



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** : అరణ్యం వీడి జనారణ్యం చేరిన పెద్దపులి ఐదు రోజులుగా రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం నియోజకవర్గాల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రోజుకో గ్రామానికి మకాం మారుస్తూ ప్రయాణం సాగిస్తోంది. పులి జాడ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న అటవీ అధికారులు ఎట్టకేలకు అది శాటిలైట్ సిటీ వద్ద అక్కమ్మ తల్లి కొండపై సేదతీరుతున్నట్టు గుర్తించారు. ఎలాగైనా పులిని బంధించి దాని ఆవాసానికి తరలిస్తామని అధికారులు చెబుతున్నారు. పులి సంచారంపై రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్

(తరువాయి 2వ పేజీలో)

## రెండున్నర గంటలపాటు సాగిన
# చంద్రబాబు, పవన్ సమావేశం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావ-నకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు.

## వచ్చేది మా ప్రభుత్వమే..
# వడ్డీతో సహా చెల్లిస్తాం: జగన్



**గుంటూరు, పతాకం న్యూస్:** ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు.. మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి అంబటి కాపు కులానికి టైగర్.. అలాంటి వ్యక్తిని స్టేషన్లో నల్లపాడు, పట్టాభిపురం సీఐలు దారుణంగా కొట్టారన్న వైఎస్ జగన్.. వచ్చేది తమ ప్రభుత్వమేనని.. అన్నింటిపై ఎంక్వైరీలు వేస్తాం.. వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. "మా ప్రభుత్వం వచ్చాక అన్ని లెక్కలు తేలుస్తాం. విషపూరిత విత్తనాలు నాటడం ఆపండి. రేపు మా కార్యకర్తలు స్పందిస్తే ఏమవుతుందో ఆలోచించండి. చేతనైతే ఇచ్చిన హామీలు నెరవేర్చండి. దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. రాష్ట్రవ్యాప్తంగా బంద్కు కూడా పిలుపునిస్తాం. మేం భయపడతామనుకుంటే చంద్రబాబు మూర్ఖుడే. వైఎస్సార్సీపీ శ్రేణులు నాలుగింతలు రెచ్చిపోయి కూటమి ప్రభుత్వాన్ని పెకిలిస్తారు" అని వైఎస్ జగన్ హెచ్చరించారు. "200మంది సీఐ, ఎస్సైలు వీఆర్లో ఉన్నారు. మీకు కావాల్సిన వారినే పోలీసులు నియమించుకున్నారు. బిహార్ సంగతేమో కానీ.. ఏపీలో మాత్రం జంగల్ రాజ్ నడుస్తోంది. తప్పు చేసిన అధికారుల్ని ఆధారాలతో సహా కోర్టులో నిలబెడతాం' అని వైఎస్ జగన్ వార్నింగ్ ఇచ్చారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### భారాలు

పార్లమెంటులో నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్ ఈ ప్రభుత్వ ఆర్థిక విధానానికి మరో స్పష్టమైన సాక్ష్యం. ఈ బడ్జెట్ ప్రజల అవసరాల కోసం రూపొందినది కాదు. కార్పొరేట్ మూలధనం, కమ్యూనల్ రాజకీయాల కలయికలో తయారైన లెక్కల మాయాజాలం మాత్రమే. వారు తయారు చేసినదే ఆర్థికమంత్రి పార్లమెంట్‌లో చదివారు. బడ్జెట్ అనేది కేవలం ఆదాయ, వ్యయాల పట్టిక కాదు. అది ఏ ప్రభుత్వానికైనా తన వర్గ స్వభావాన్ని బహిర్గతం చేసే రాజకీయ పత్రం. ఎవరి నుంచి ఆదాయం వసూలు చేస్తారు? ఆ డబ్బును ఎవరి కోసం ఖర్చు చేస్తారు? అన్న ప్రశ్నలకు బడ్జెట్ స్పష్టమైన సమాధానం ఇస్తుంది. ఆ కోణంలో చూస్తే, ఈ బడ్జెట్ పేదలు, కార్మికులు, రైతులు, గ్రామీణ కూలీలకు సంబంధించినది కాదు. ఇది ధనవంతుల ప్రయోజనాలను కాపాడే విధాన ప్రకటన. నిరుద్యోగం పెరుగుతున్నప్పుడు, ధరలు ఎగబాకుతున్నప్పుడు, వ్యవసాయం సంక్షోభంలో ఉన్నప్పుడు, కార్మికుల కష్టాలు పెరుగుతున్నప్పుడు... ప్రభుత్వ బడ్జెట్ ఉత్పత్తి పెంపు, ఉపాధి సృష్టి, ప్రజల కొనుగోలు శక్తి పెంపుపై దృష్టి పెట్టాలి. ప్రజా పెట్టుబడులను పెంచి, సంక్షేమాన్ని బలోపేతం చేయాలి. ఇది కనీస ఆర్థిక తర్కం. కానీ, ఈ బడ్జెట్ దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రజా ఖర్చులను పెంచడం బదులు వాటిని కత్తిరించడం, సంక్షేమ పథకాలను బలపరచడం బదులు నిర్వీర్యం చేయడం, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం బదులు ప్రైవేటీకరణకు దారులు వేయడం...ఇవే ఈ బడ్జెట్ అసలు లక్షణాలు. ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడం కాదు, దాని భారాన్ని ప్రజలపైకి నెట్టడమే ఈ విధానం. 2025-26 బడ్జెట్‌లో మొత్తం వ్యయం రూ.50,65,345 కోట్లుగా ప్రకటించారు. కానీ, సవరించిన అంచనాల్లో దాన్ని 49,64,842 కోట్లకు తగ్గించారు. అంటే ప్రకటించిన ఖర్చులోనే దాదాపు లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేయకుండా ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఇప్పుడు మళ్లీ రూ.53,47,315 కోట్లు అంటూ కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టి, గత ఏడాదితో పోలిస్తే ఆరు శాతం పెరిగిందని ప్రచారం చేస్తున్నారు. కానీ, ఇది బడ్జెట్ అంచనాలతో పోలిక మాత్రమే. వాస్తవంగా ఖర్చు చేసిన సవరించిన అంచనాలతో పోలిస్తే ఇది కేవలం రెండు శాతం మాత్రమే. ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఇది పెరుగుదల కాదు, ప్రజా ఖర్చుల కుదింపు. సవరించిన అంచనాల పేరుతో ప్రభుత్వం దాదాపు రూ.1,40,000 కోట్లకు పైగా నిధులను ప్రజలకు సంబంధించిన రంగాల నుంచి కత్తిరించింది. ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నుల వసూళ్లు కేవలం 11-12 లక్షల కోట్ల మధ్యే ఉన్నాయి. కానీ పరోక్ష పన్నులు, ముఖ్యంగా జీఎస్టీ 14-15 లక్షల కోట్లకు చేరాయి. అంటే ప్రభుత్వ ఆదాయానికి ప్రధాన వనరు ప్రజల ఖర్చే. రోజువారీ వినియోగ వస్తువులపై పన్నులు వేసి, ప్రజల రక్తాన్ని పీల్చే జీఎస్టీ వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. కార్పొరేట్ లాభాలపై ప్రగతిశీల పన్నుల మాట ఎక్కడా లేదు. ఇది స్పష్టమైన వర్గ పక్షపాతం. కార్పొరేట్ లాభాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. పన్ను రాయితీలు, మినహాయింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికుల విషయానికి వచ్చేసరికి ప్రభుత్వం పూర్తిగా నిశ్శబ్దం పాటించింది. కొత్త లేబర్‌కోడ్స్ అమలుకు అనుగుణంగా వేతనాలు పెంచే అంశం గానీ, శాశ్వత ఉపాధి (పర్మనెన్సీ), ఉద్యోగ భద్రతపై గానీ ఎలాంటి ప్రస్తావన లేదు. కనీస వేతనాలపై హామీ లేదు. పనిగంటల పరిమితిపై స్పష్టత లేదు. యూనియన్ హక్కులపై ఒక్క మాట లేదు. మోడీకి ముందు రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉండేది. అది ప్రజా రవాణా అవసరాలను కేంద్రంగా పెట్టుకుని రూపొందించబడేది. ఇప్పుడు దాన్ని జనరల్ బడ్జెట్‌లో కలిపేశారు. ఫలితం, హైస్పీడ్, హైటెక్ రైళ్లు తప్ప, సామాన్య ప్రజల ప్రయాణానికి అవసరమైన ప్యాసింజర్ రైళ్లు, జనరల్ కంపార్టుమెంట్ల పెంపుపై ఎలాంటి ప్రస్తావన లేదు. నేటి రైల్వే విధానం ఎలిటిఫికేషన్‌కు నిదర్శనం. సాధారణ ప్రయాణికుడికి రైలు ప్రయాణం మరింత ఖరీదవుతోంది, అసౌకర్యంగా మారుతోంది. ఇది ప్రజా సేవ కాదు, లాభాల కోసం నడిచే వ్యాపారంగా రైల్వేను మార్చే ప్రయత్నం. దేశంలో ఉపాధి ఎక్కువగా ప్రైవేటు రంగంలోనే ఉంది. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లపై ఈ బడ్జెట్ పూర్తిగా మౌనం పాటించింది. సామాజిక న్యాయం అన్న భావన ఈ ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో ఎక్కడా కనిపించదు. మాటల్లో "సబ్‌కా సాథ్", విధానాల్లో "కొద్ది మందికే సౌకర్యం". రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఆధారం లేదు. కనీస మద్దతు ధరకి చట్టబద్ధ హామీపై ఒక్క మాట లేదు. ఎరువుల సబ్సిడీ తగ్గింపు, వ్యవసాయ పెట్టుబడుల స్తబ్ధత రైతులను మరింత అప్పుల్లోకి నెట్టే ప్రమాదం ఉంది.

## తల్లీకొడుకు దారుణహత్య.. దహన సంస్కారాలు చేయించిన పోలీసులు




**అనంతపురం, పతాకం న్యూస్:** శింగనమల మండలం తరిమెల గ్రామంలో ఆస్తి తగాదాలు దారుణహత్యకు గురైన తల్లీ కొడుకులు ఎల్లమ్మ, చిన్నాల మృతదేహాలకు అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సిఐ కౌలుట్లయ్య ఎస్సై సాగర్ దగ్గరుండి హత్యకు గురైన తల్లి కొడుకుల మృతదేహాలకు దహన సంస్కారాలు చేయించారు. తల్లి కొడుకు హత్యానంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకోవడానికి బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులే ఆత్మ బంధువులై అన్ని అంతిమ కార్యాలు నిర్వహించారు. పోలీసుల కాటిన్యాన్ని గురించి మాట్లాడే వారు పోలీసులు అందరూ కఠిన హృదయులు కాదని అందరూ అలానే ఉండరు అని గొప్ప మనసు ఉన్నటువంటి ఇటువంటి పోలీసులు కూడా ఉంటారని సీఐ కౌలుట్లయ్య ఎస్సై సాగర్ ను పలువురు ప్రశంసించారు.

## రాహుల్ గాంధీ-రవ్‌నీత్ బిట్టుల మధ్య మాటల యుద్ధం



**అనంతపురం, పతాకం న్యూస్:** పార్లమెంటు ఆవరణలో రాహుల్‌గాంధీ- కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ బిట్టుల మధ్య మాటల యుద్ధం జరిగింది. రాహుల్ రవ్‌నీత్‌ని ద్రోహి అంటే.. రవ్‌నీత్ దేశ్‌కా దుష్మన్ అని వ్యాఖ్యానించారు. యూరోపియన్ యూనియన్, అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలపై పార్లమెంటులో చర్చకు పెట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు బుధవారం పార్లమెంటు మకర ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రవ్‌నీత్ బిట్టు ఎంపీలు నిరసన వైపుగా వచ్చారు. ఆ సమయలో రాహుల్ రవ్‌నీత్ బిట్టుతో 'హలో బ్రదర్, నా దేశ ద్రోహి మిత్రమా.. మీరేమీ చింతించకండి.. మీరు తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తారు అని అంటూ కరచాలనం చేయడానికి చేయనందించారు. అయితే రవ్‌నీత్ బిట్టు రాహుల్ చేయి అందుకోవడానికి తిరస్కరించారు. రాహుల్ మాటలకు స్పందనగా.. రవనీత్ బిట్టు రాహుల్‌ని దేశ్ కే దుష్మన్ (రాష్ట్రానికి శత్రువు) అని అన్నారు. పైగా నిరసన చేస్తున్న ఎంపీలను ఆయన ఎగతాళి చేశారు. నిరసన చేస్తున్న ఎంపీలనుదేద్దశించి 'వారు యుద్ధంలో గెలిచినట్లుగా కూర్చున్నారు' అని హేళన చేశారు. కాగా, రవ్‌నీత్ బిట్టు 2024లో కాంగ్రెస్‌ని వదిలి బిజెపిలోకి చేరారు.

## బీజేపీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళ లేదు : ఖర్గే



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వంపై రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. సభలో బుధవారం ఆయన మణిపూర్‌పై మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో 200 మంది చనిపోయారు. 70 వేల మంది నిరాశ్రయులయ్యారు. మణిపూర్‌ను ఓ మిలటరీ జోన్‌గా మార్చేశారు అని ఖర్గే ఆరోపించారు. ఈ సందర్భంగా ఖర్గే మోడీని ఎద్దేవా చేశారు. 'పోర్చుగల్ నుంచి భారతదేశానికి రావడానికి వాస్కోడిగామాకు 11 నెలలు పట్టిందని చరిత్ర చెబుతుంది. స్పెయిన్ నుంచి ఉత్తర అమెరికాకు చేరుకోవడానికి కొలంబస్‌కు రెండు నెలలు పట్టింది. కానీ విషాదమేమిటంటే దేశంలో ఉన్న మణిపూర్ రాష్ట్రానికి చేరుకోవడానికి మన ప్రధానికి రెండేళ్లు పట్టింది' అని ఖర్గే చురకలంటించారు. అలాగే ఆయన సభలో కులగణన అంశాన్ని లేవనెత్తారు. కులగణనకు సంబంధించి ఇప్పటివరకు రోడ్‌మ్యాప్ లేదు. ఏ రాజకీయ పార్టీలను, రాష్ట్రాలను లేదా నిపుణలను సంప్రదించలేదు అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్టీ, ఎస్టీల పరిస్థితిని మెరుగుపరచడానికి చర్యలు తీసుకున్నాయి. ఇప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎస్టీ,ఎస్టీల అభివృద్ధి కోసం చేపట్టిన పథకాల్ని నీరుగార్చింది. ఈ పథకాలకు బడ్జెట్‌లో నిధులు తక్కువగా కేటాయించింది. కేటాయించిన డబ్బు కూడా ఖర్చు చేయడం లేదు అని ఖర్గే ఆరోపించారు. బిజెపికి ఒక్క మహిళ కూడా పార్టీ అధ్యక్షురాలిగా లేరు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉండి 60 సంవత్సరాలు అయింది. ఆ కాలంలో చాలామంది మహిళలు మహిళాసాధికారతకు చిహ్నాలుగా మారారు. బెజెపి పార్టీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళను కూడా ఎన్నుకోలేదు. వంద సంవత్సరాలలో ఆర్‌ఎస్‌ఎస్‌కు మహిళా చీఫ్ లేరు అని ఖర్గే ఎత్తిచూపారు.

## న్యాయం ఏడుస్తోంది.. సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు.మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్ మ్యాచ్‌ల వల్ల మాత్రమే వోటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

## జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు మృతి



**జమ్మూకాశ్మీర్, పతాకం న్యూస్:** జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. వారు జైషే మహ్మద్‌కు చెందినవారుగా అధికారులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు ... జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించి నిఘా సమాచారం అందడంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం మిలిటెంట్లు పారిపోయారు. ఉదంపుర్ ప్రాంతంలోని గుహల్లో వారు ఉన్నట్టు సమాచారం అందడంతో మళ్లీ గాలింపు చేపట్టారు. గుహలో ఉన్న వారిపై కాల్పులు జరపడంతో ఇద్దరు మిలిటెంట్లు చనిపోయారని, వారిలో ఒకరు పాక్ జాతీయుడు కాగా మరొకరు స్థానిక వ్యక్తి అని పేర్కొన్నారు. వారి నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఏకే-47 రైఫిల్స్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## అంబటి, జోగి లాంటి బ్యాచ్‌లు ఇంకా ఉన్నాయి: భూమా అఖిల ప్రియ



**కర్నూలు, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్, జగన్ ఇద్దరూ రైతుల కడుపు కొట్టి తమ కడుపులు నింపుకొన్నారని మండిపడ్డారు. రైతులకు మేలు చేయాల్సిన పాలకులు.. స్వార్థ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ లాంటి నేతల బ్యాచ్ ఇంకా వైసీపీలో కొనసాగుతోందని అన్నారు. లోకేష్ అన్న ఒక్కసారి కనుసైగ చేస్తే.. వైసీపీ నేతలు మైకుల ముందు మాట్లాడలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు తమ ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుని, ఆలోచనా విధానాన్ని మార్చుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టామని అఖిలప్రియ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. అంబటి, జోగి లాంటి నేతలు తమ ఇష్టానుసారంగా మాట్లాడితే జగన్ వారిని వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలు ఏ ముఖం పెట్టుకుని సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ దగ్గరకు వెళ్తున్నారని ప్రశ్నించారు. సీమ రైతులకు వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. వైసీపీ నేతల మాటలను వారి ఇళ్లలో ఉన్న భార్యలే వినరని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి హాజరు కాకుండా ఎమ్మెల్యేలు జీతాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు ప్రజల డబ్బుతో జీతాలు ఇవ్వడం అన్యాయమని అఖిలప్రియ అభిప్రాయపడ్డారు.

(మొదటిపేజీ తరువాయి)

## పెద్దపులిని పట్టుకునేందుకు 12 టీంలు సిద్ధం

కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు స్పం దించారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పులిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. పులిని పట్టుకునేందుకు పుణె నుంచి నిపుణుల బృందం వస్తోందన్నారు. ప్రస్తుతం పులిని పట్టుకునేందుకు 12 బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పులి గురించి స్థానికులు ఎవరు భయపడాల్సిన పనిలేదని వెల్లడించారు. రాత్రిపూట మాత్రం ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. మహారాష్ట్ర అభయారణ్యం ఏలూరు జిల్లాలోకి వచ్చిందని తెలిపారు. పులి రోజుకు 15 నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణిస్తోందన్నారు. ప్రస్తుతం శాటిలైట్ సిటీ సమీపంలోని జీడితోటలో పులి ఉందన్నారు. పులిని ఈ రాత్రికి ఎలాగైనా పట్టుకుంటాని చలపతిరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం రోజుకో గ్రామంలో తిరుగుతోన్న పెద్దపులి తొర్రేడు, వెంకటనగరం, కోలమూరు, గాడాల మీదుగా రాత్రి దివాన్ చెరువు వద్ద జాతీయ రహదారిని దాటి రాజానగరం మండలం శ్రీరాంపురం, రఘునాధపురం గ్రామాల్లో సంచరించింది. రఘునాధపురంలో దూడను చంపిన పెద్దపులి అనంతరం రాజమహేంద్రవరం గ్రామీణ మండలం పిడుంగొయ్యి వైపు వచ్చింది. తాజాగా సాటిలైట్ సిటీ వద్ద అక్కమ్మ తల్లి కొండపై పులి సేదతీరుతున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. ఆయా గ్రామాల్లో పులి పాద ముద్రలు సేకరించారు. పులిని పట్టుకునేందుకు పూణే నుంచి నిపుణుల బృందాన్ని రప్పిస్తున్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు, పులి సంచరిస్తున్న గ్రామాల్లో పర్యటించారు. పాద ముద్రలు పరిశీలించారు. రాజమహేంద్రవరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి, డీఎఫ్ఓ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో అటవీ సిబ్బంది పులి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. రోజుకో ఊరు తిరుగుతూ పశువుల పై దాడి చేస్తున్న పెద్దపులి సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. రాజమహేంద్రవరం చుట్టుపక్కల గ్రామాల్లో పులి సంచారం పైనే అందరూ చర్చిస్తున్నారు. దశాబ్ద కాలంలో ఉమ్మడి గోదావరి జిల్లాలో రెండేళ్లకు ఓసారి పెద్దపులి లేదా చిరుతపులి వస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో పులి రావడానికి కారణాలు ఏమై ఉండొచ్చు, దాని గమనం, తీరు ఎలా ఉంటుందనే అంశాలపై డీఎఫ్‌వో ప్రభాకరరావు, ఎఫ్ఆర్‌వో దావీదురాజు పలు విషయాలు వెల్లడించారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్తుందని తొలుత భావించాం. కానీ వెంకటనగర్, కోలమూరు, గాడాల మీదుగా పయనించింది. మన్యం వైపు వెళ్తుంది అనుకున్నాం. కానీ మంగళవారం రాత్రికి హైవే పక్కన కొబ్బరితోటలోకి చేరింది. అక్కడి నుంచి పుష్కరవనం, పాలచర్ల, హౌసింగ్‌బోర్డుకాలనీ, దివాన్‌చెరువు అభయారణ్యం ఎటైనా వెళ్లొచ్చు దాని ప్రయాణం అంతుచిక్కట్లేదు. పులి సంచరించే ప్రాంతాల్లో 15 ట్రాప్ కెమెరాలు, రెండు బోన్లు ఏర్పాటు చేస్తున్నాం. తోట చుట్టూ బెటాలియన్ బలగాలు ఉన్నాయి. పుణే నిపుణులతో మాట్లాడుతున్నాం. వారిని రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. మత్తుమందు ఇవ్వాలంటే ఉదయంపూటే అనుకూలం. అది సంచారించే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. మనకు తూర్పున ఉన్న కనుమలలో సెంట్రల్ ఇండియా టైగర్ ల్యాండ్‌స్కేప్ ఉంది. తెలంగాణలో కవ్వాల్, ఒడిశాలో సిమిలిపాల్ టైగర్, మహారాష్ట్రలో తడోబా, ఇంకోవైపు ఛత్తీస్‌గఢ్‌లో రిజర్వ్ ఫారెస్టులు ఉన్నాయి. వాటి మధ్యలో పాపికొండలు నేషనల్ పార్క్ ఉన్నాయి. కొత్త ఆవాసం లేదా తోడు కోసం వెతుక్కునే క్రమంలో ఇటువైపు వస్తున్నాయి.

# టీడీపీ నూతన అధ్యక్షుడిని కలిసిన దేవరాపల్లి మండల టీడీపీ సీనియర్ నాయకులు



**అనకాపల్లి జిల్లా, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మహోత్సవము అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నిక కాబడిన అనకాపల్లి పార్లమెంట్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ప్రధాన కార్యదర్శి లాలం కాసింనాయుడు కలిసి తెలుగుదేశం పార్టీ ఆఫీసులో వందలాది మంది కార్యకర్తలు సమూహంలో ప్రమాణ స్వీకారం జరిగింది.

ఈ కార్యక్రమానికి మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం నుండి వందలాదిమంది కార్యకర్తలు మాజీ మండల టిడిపి అధ్యక్షుడు,రావికతం మండలం పరిశీలకుడు చీటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు బయలుదేరి ప్రమాణ స్వీకారానికి హాజరైనారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన బత్తుల తాతయ్య బాబుకి మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం టిడిపి నాయకులు శాలువా కప్పి,పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కాణిపాకం వినాయక స్వామి డైరెక్టర్ చల్లా కృష్ణవేణి నానాజీ, కర్రినాయుడు, గొర్లె దేముళ్ళు,కిల్లీ గోవింద్, పోతల నాయుడు,బాబ్జి,రెడ్డి సూర్యారావు,ఆదిరెడ్డి అక్కు తాత,బండారు శ్రీరామ్ మూర్తి,బాబురావు పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ఇద్దరు పాత నేరస్థులను గుర్తించిన హ్యూమనాయిడ్ రోబో 'అర్జున్'



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో భద్రతా విధుల్లో ఉన్న 'ఏఎస్‌సీ అర్జున్' అనే హ్యూమనాయిడ్ రోబో తన సత్తా చాటింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబో, ఇద్దరు పాత నేరస్థులను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం, రాత్రి 8.10 గంటల సమయంలో స్టేషన్ ప్రాంగణంలో 'అర్జున్' విధుల్లో ఉంది. అప్పటికే నేరస్థుల వివరాలు, ఫొటోలను రోబోలో అప్‌లోడ్ చేసి ఉంచారు. స్టేషన్‌లో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను రోబో తన కెమెరాతో చిత్రీకరించి, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థులుగా గుర్తించింది. వెంటనే ఈ సమాచారాన్ని, సీసీటీవీ ఫుటేజీ వివరాలను కంట్రోల్ రూమ్‌కు పంపింది. రోబో నుంచి సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ బీఎస్. నారాయణ, ఎస్సై వి. కీర్తి రెడ్డి నేతృత్వంలోని బృందాన్ని అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి శివ, బంగారు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ప్రయాణ టికెట్లు కూడా లేవని గుర్తించారు. విచారణలో వీరిద్దరిపై రాయగడ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు తేలింది. దీంతో కేసు నమోదు చేసి, రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా స్పందిస్తూ, పాత నేరస్థులను గుర్తించడంలో ఏఐ ఆధారిత రోబో సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో నేర నియంత్రణలో ఇలాంటి టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# అంబటి రాంబాబు వ్యాఖ్యలు ఖండించిన కాణిపాకం బోర్డు డైరెక్టర్ చల్లా కృష్ణవేణి



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం రైవాడ మాజీ సర్పంచ్ చల్లా కృష్ణవేణి వేలేకరులు సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి లడ్డు తయారు చేసే విషయంలో కల్తీ జరిగిందని స్పష్టంగా కమిటీ తెల్చేశీది. కల్తీ జరగలేదు అని అంబటి మాట్లాడటం సిగ్గుగా ఉంది అని సీఎం చంద్రబాబు నాయుడు తల్లి పై చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉంది. చంద్రబాబు నాయుడు 53 రోజులు అక్రమంగా జైల్లో పెట్టినప్పుడు వైయస్సార్ పార్టీ నాయకులని, లోకేష్ బాబు ఏరోజు అయిన ఇలాంటి సిగ్గుపడే మాటలు మాట్లాడలేదు. చంద్రబాబు నాయుడు తల్లిని అంబటి రాంబాబు ఆడిన మాటలు సరికాదని మహిళ సమాజాన్ని కించిపరిచేలా మాటలు మంచి పద్ధతి కాదని జిల్లా మహిళా యాదవ సంఘం అధ్యక్షురాలు, చల్లా కృష్ణవేణి ఆవేదన చేసారు, అంబటి రాంబాబుకు పోలీసులు తగిన బుద్ధి చెప్పారు అని టీడీపీ నేత కృష్ణవేణి అన్నారు

# బడ్జెట్‌లో సామాన్యుల పట్ల నిర్లక్ష్యం : డివైఎఫ్ఐ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులను నిర్లక్ష్యం చేశారని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడానికి నిరసనగా తాటిచెట్లపాలెం ఎఎస్ఆర్ నగర్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, భారతదేశంలో పేదరికం పెరుగుతుందని, దీనిని రూపుమాపడానికి ప్రణాళిక కేంద్ర ప్రభుత్వం దగ్గర లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని పెద్ద అప్పుల ఊబిలోకి దించుతుందన్నారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలమైందని పేర్కొన్నారు. ఒకవైపు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపించలేదని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్, మెట్రో రైలుకు బడ్జెట్ కేటాయింపులు లేవని తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు నిధులు ఇవ్వలేదన్నారు. భవిష్యత్తులో నిరుద్యోగ యువతను కలుపుకొని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కోటి, జయరాజు, కాలనీ నాయకులు గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగు నీటి ఎద్దడి నివారణకు కృషి



**భీమిలి, పతాకం న్యూస్:** రానున్న వేసవికాలం దృష్ట్యా మండలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలని ఎంపిపి డి.వాసురాజు సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు జరుగనున్న "సమ్మర్ క్రాష్" కార్యక్రమాన్ని ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 583 తాగు నీటి బోర్లు ఉండగా, మార్చి 15 లోగా ఏయే గ్రామాల్లో తాగు నీటి బోర్లు మరమ్మతుకు గురయ్యాయన్నది క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. తాగు నీటి సమస్య ఉత్పన్నం గాకుండా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెవి.నరసింహారావు, డిప్యూటీ ఎంపిడిఒ కె.రమేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పి.ఈశ్వరీభాయి, ఎఇ ఎస్.దుర్గా భవానీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. బోరుబావులకు మరమ్మతులు తగరపువలస : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని భీమునిపట్నం మండలం అమనాం పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరుబావులను సరిచేశారు. క్రాస్ ప్రోగ్రాం కింద ప్రత్యేక వాహనం ద్వారా సమస్య ఉన్న బోరు బావులను గుర్తించారు. అమనాం పరిధి జీరుపేట, పిట్ట పేట, నక్కిరెల్లిపేట, నరసయ్యపేట గ్రామాల్లో బోరు బావులకు మరమ్మత్తులు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరు మెకానిక్ పద్మనాభం, మూర్తి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి: కలెక్టర్ దినేశ్‌కుమార్



**పాడేరు, పతాకం న్యూస్:**రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి రహదారి సదుపాయాన్ని అనుసంధానం చేసి డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లోని అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో ం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జన్‌మన్, అడవితల్లి బాట కార్యక్రమాల్లో భాగంగా ప్రతి మారుమూల గిరిజన పల్లెలకు సైతం రోడ్డు సదుపాయం అందుబాటులోకి రావాలన్నారు. రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో అవసరమైన సామగ్రి అందుబాటులో లేకుంటే సమీపంలోనే వాటిని సేకరించేందుకు గాను క్వారీలకు అవసరమైన అనుమతులను ఇవ్వాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్‌కు కలెక్టర్ సూచించారు. అలాగే అటవీ అనుమతులకు సంబంధించి ఎటువంటి పెండింగ్ ఉన్నా తక్షణమే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వాటిని పరిష్కరించుకుని పనులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా రోడ్ల నిర్మాణానికి గాని, గిరిజనుల సాగుభూములకు అటవీ హక్కులు కల్పించేందుకు గాని ఎటువంటి సమస్యలు ఏర్పడినా వాటిని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులు ఈ నెల 5 నుంచి వంద రోజుల ప్రణాళికను రూపొందించుకుని లక్ష్యం మేరకు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రానున్న మూడు నెలల్లో ఆయా రోడ్ల నిర్మాణం పూర్తయ్యేలా పనులు జరగాలన్నారు. టెండర్లు దక్కించుకుని ప్రారంభించని రోడ్ల పనులుంటే తక్షణమే సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించి పనులు మొదలు పెట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న రోడ్లకు సంబంధించిన హెచ్చరికల బోర్డుల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. వివిధ ఇంజనీరింగ్ శాఖలు, జాతీయ ఉపాధి హామీ పథకం, పీఎం జన్‌మన్‌లో భాగంగా మంజూరైన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్లు తిరుమణి శ్రీపూజ, స్మరణ్‌రాజ్, డ్వామా పీడీ విద్యాసాగర్, పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు టి.కొండయ్యపడాల్, బి.రవికుమార్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు జి.డేవిడ్‌రాజు, కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై మరిన్ని సీసీ కెమెరాలు: ఎస్పీ తుహిన్ సిన్హా



**నక్కపల్లి, పతాకం న్యూస్:** జాతీయ రహదారిపై ప్రధాన జంక్షన్లు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. సాయంత్రం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు స్టేషన్ పరిధిలో అన్ని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయాలని, ఒకవేళ ఎక్కడైనా పనిచేయకపోతే వెంటనే మరమ్మతు చేయించాలని చెప్పారు. జాతీయ రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ భారీ వాహనాలు ఆపకుండా చర్యలు చేపట్టాలన్నారు. నక్కపల్లి మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, త్వరలో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కానున్నదని, అందువల్ల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గంజాయి రవాణా, నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపాలని, పాతనేరస్థులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా వుంచాలన్నారు. ఎస్పీ వెంట ఎస్ఐలు సన్నిబాబు, మల్లీశ్వరరావు, అంజుమా వున్నారు.

# పెదబయలు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ సస్పెన్షన్

**పెదబయలు, పతాకం న్యూస్:** విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగంపై పెదబయలు ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సస్పెండ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా అభివృద్ధి, తదితర అంశాలపై కలెక్టర్ ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అయితే పెదబయలు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనలేదు. దీంతో కలెక్టర్ ఆయనకు స్వయంగా కాల్ చేస్తే, తాను ఆస్పత్రిలో ఉన్నానని పేర్కొన్నారు. కానీ వాస్తవానికి ఆయన ఆస్పత్రిలో లేకపోగా మద్యం మత్తులో ఉన్నట్టు కలెక్టర్‌కు సమాచారం అందింది. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ఆయనను తక్షణమే సస్పెండ్ చేసి, ఏవోగా పని చేస్తున్న పూర్ణయ్యకు ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేసే ఎవరైనా శాఖాపరమైన చర్యలు ఎదుర్కొక తప్పదని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు.

# జోరుగా వారపు సంతల్లో పిప్పళ్ల విక్రయాలు



**పాడేరు, పతాకం న్యూస్:** ప్రస్తుతం మన్యంలోని పలు గ్రామాల్లో, వారపు సంతల్లో పిప్పళ్ల విక్రయాలు జోరందు కున్నాయి. అలాగే కొనుగోలు ధర సైతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. పాడేరు మండలం గుత్తులపుట్టులోని వారపు సంతకు సుమారు 500 బస్తాల పిప్పళ్లను గిరిజన రైతులు వర్తకులకు విక్రయించారు. ప్రస్తుతం పిప్పళ్ల సీజన్ కావడంతో హుకుంపేటలో, పెదబయలులో, జి.మాడుగుల, పాడేరు మండలం గుత్తులపుట్టు వారపు సంతల్లో పిప్పళ్ల కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఔషధ గుణాలున్న పిప్పళ్లను ఏజెన్సీ వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో గిరిజనులు సాగు చేస్తున్నారని ఒక అంచనా. ప్రతి ఏడాది డిసెంబరు ఆఖరి వారం నుంచి పిప్పళ్ల క్రయవిక్రయాలు మొదలై మార్చి నెలాఖరుకు వరకు కొనసాగుతాయి. వడ్డాది మాడుగులకు చెందిన వర్తకులు గిరిజన రైతులు, గిరిజన చిరు వర్తకుల నుంచి వాటిని కొనుగోలు చేస్తారు. పలు రకాల మందుల తయారీకి వినియోగిస్తుండడంతో వీటికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లతో మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం పిప్పళ్ల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. 2021 వరకు పిప్పళ్లు కొనుగోలు ధరలు పతనం కాగా, 2022 నుంచి ధరలు కాస్త బాగున్నాయని, అలాగే 2023 సంవత్సరం నుంచి ధరలు పతనం కాకుండా స్థిరంగా కొనసాగుతుండడంతో మార్కెట్ బాగుందని వర్తకులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.350 చొప్పున వారపు సంతల్లో వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే అంతర్జాతీయ, జాతీయ మార్కెట్‌లలో ధరలకు అనుగుణంగానే స్థానిక సంతల్లో ఆ ధరలను నిర్ణయిస్తారని వర్తకులు తెలిపారు.

# సాహిత్యంపై సమాలోచన




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరానికి చెందిన సమతా సాహితీ నెలవారీ సాహిత్య కార్యక్రమంలో భాగంగా పౌర గ్రంథాలయంలో ఆచార్య ఎండ్లూరి సుధాకర్ సాహిత్యంపై సమాలోచన సభ నిర్వహించారు. ముందుగా ఆచార్య చందు సుబ్బారావు, వల్లే నాంచారయ్య, మంజరి మృతికి సమతా సాహితి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. డాక్టర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ తన కవిత్వం, కథలు ద్వారా తన ఆశయాన్ని దాదాపుగా నెరవేర్చారున్నారు. సభాధ్యక్షులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, దళిత బహుజన సాహిత్యోద్యమాన్ని ఉధృతం చేసిన బలమైన కవిగా ఆచార్య ఎండ్లూరిని అభివర్ణించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ, సాహిత్యానికీ, ఉద్యమాలకూ అతీతంగా సుధాకర్ మంచి స్నేహితుడూ, గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి అని కొనియాడారు. అంత్యప్రాసలతో కూడిన అతని కవితా శైలీ, సున్నితమైన వ్యంగంతో కూడిన కథాకథనం తీరు సుధాకర్‌ను గొప్ప సాహిత్య వేత్తను చేశాయన్నారు. ఆచార్య సిమ్మన్న మాట్లాడుతూ, డాక్టర్ ఎండ్లూరి అకడమిక్ విజయాలను విశ్లేషించారు. తెలుగు విశ్వవిద్యాలయంలో పీఠాధిపతిగా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఎండ్లూరి తనదైన ముద్ర వేశారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎం.దాసు ఎండ్లూరి సుధాకర్ కవితలు కొన్నింటిని గుర్తుచేశారు. ఈ సభలో బి.గోవర్ధన్, కొరమాటి చిన్నారావు, డాక్టర్ ప్రతాప్, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### పరిశోధన ఫలితాలు రైతులకు చేరేలా
# ప్రత్యేక కార్యాచరణ



**చింతపల్లి, పతాకం న్యూస్:** లాభసాటి వ్యవసాయానికి శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధన ఫలితాలు రైతులకు చేరవేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని గుంటూరు లామ్ ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు(డీఈ) డాక్టర్ జి.శివనారాయణ తెలిపారు. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఆయన సందర్శించారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. శాస్త్రవేత్తలతో సమావేశమై విస్తరణ విభాగంలో చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలను ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి వివరించారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో డీఈ ముచ్చటించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.శివనారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలో 13, స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలో మూడు కృషి విజ్ఞాన కేంద్రాలు, 13 జిల్లా ఏరువాక కేంద్రాలు(డాట్ సెంటర్)లు ఉన్నాయన్నారు. కేవీకే, ఏరువాక కేంద్రాల ద్వారా రైతుల వ్యవసాయ ప్రగతికి పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సాంకేతికపరమైన శిక్షణలు అందజేసి రైతులు వ్యవసాయంలో ఎదుర్కొనే సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు చేపట్టిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలను కేవీకే, డాట్ సెంటర్ల ద్వారా రైతులకు చేరవేస్తూ సేవలను విస్తృతం చేశామని చెప్పారు. రైతులను కేవీకేల ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామని డీఈ డాక్టర్ శివనారాయణ తెలిపారు. వ్యవసాయంతో పాటు పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీలతో పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకానికి ప్రత్యేక ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గిరిజన ప్రాంతంలో అభ్యుదయ రైతులతో విత్తనోత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ శివనారాయణ తెలిపారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన మేలిరకం రాజ్‌మా, వలిసెలు, వరి, పసుపు, అల్లం వంగడాలను రైతులకు అందించేందుకు విస్తరణ విభాగం కృషి చేస్తున్నదన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను పరిశోధన స్థానంలో ఉత్పత్తి చేయడం సాధ్యంకాదని, ఈ మేరకు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన వంగడాలను అభ్యుదయ రైతులకు అందజేసి అధిక మొత్తంలో విత్తనాలను ఉత్పత్తి చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. అభ్యుదయ రైతులు ఉత్పత్తి చేసిన వంగడాలను ఇతర రైతులకు అందజేస్తామన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి మార్కెటింగ్ చేసుకుని అధిక ఆధాయం పొందేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రధానంగా మిరియాలు, పసుపు, రాజ్‌మా, వలిసెలను విలువలు జోడించి మార్కెటింగ్ చేసుకుంటే రెండింతలు అధిక ఆదాయం రైతులకు లభిస్తుందన్నారు. రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. రైతులు వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు, తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పొందేందుకు 18004250430 విశ్వవిద్యాలయం టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేయవచ్చునన్నారు. అలాగే 155251 సమీకృత సమాచార కేంద్రానికి ఫోన్ చేయవచ్చునన్నారు. రైతులు వాట్సాప్ ద్వారా పంటలను ఆశించిన చీడపీడల చిత్రాలను పంపిస్తే శాస్త్రవేత్తలు నివారణ చర్యలు తెలియజేస్తారని ఆయన చెప్పారు. రైతులు స్మార్ట్ ఫోన్ ద్వారా సులభంగా శాస్త్రవేత్తల సేవలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు పాల్గొన్నారు.

## సీతం విద్యార్థులకు అమెరికన్ స్కాలర్‌షిప్‌లు




**విజయనగరం, పతాకం న్యూస్:** సీతం కళాశాలలో చదువుతూ విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన 8 మంది విద్యార్థులు అమెరికన్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ప్రతి సంవత్సరం ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ఈ సందర్భంగా సీతం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగువారిని ఒక వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో 2008లో ఆప్త సంస్థను ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న సుమారు ఐదు వేల మంది సభ్యులు కలిసి తెలుగు రాష్ట్రాల్లోని పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యలో సీతం కళాశాల విద్యార్థులు చూపుతున్న ప్రతిభను గుర్తించి ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేయడం విశేషమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి తెలిపారు. స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ .... ప్రతి సంవత్సరం సీతం విద్యార్థులు ఆప్త స్కాలర్‌షిప్‌లకు ఎంపికవడం గర్వకారణమని అన్నారు. ఈ స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు మాత్రమే కాకుండా వారి తల్లిదండ్రులకు కూడా ఆర్థికంగా ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ, ఆప్త సంస్థ సభ్యులకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆప్త సంస్థకు హఅదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా .. ఉత్సాహంగా .. దివ్యాంగుల ఆటల పోటీలు




**విజయనగరం, పతాకం న్యూస్:** స్థానిక యూత్ హాస్టల్ లో విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహిస్తున్న కళలు, సాంస్కృతిక కార్యక్రమ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులు పలు దేశభక్తి, జానపద, భక్తి గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. అలాగే లఘు నాటికలు, ఏకపాత్రాభినయనాలతో అలరించారు. వీటితో పాటు పలువురు విద్యార్థులు గీతాలను ఆలపించారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. రెండోరోజు కూడా సమగ్ర శిక్షా ఏపీసీ డాక్టర్ ఏ.రామారావు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరుస్తూ వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు సహ సమన్వయకర్త ఎం. భారతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా కార్యాలయ అధికారులు, సిబ్బంది, జిల్లా వ్యాప్తంగా పలువురు దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలోని భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో దళితులపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసి, శిక్షించాలని ముంజేరు దళితుల ఆత్మగౌరవ కమిటీ సభ్యులు గంట్లాన అప్పారావు, వీవీ దుర్గారావులు డిమాండ్ చేశారు. విజయనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని మురికినీరంతా తమ కాలనీ వైపు మళ్లించడం అన్యాయమని సిద్ధార్థ కాలనీ దళితులు గత ఏడేళ్లుగా పోరాడుతున్నారన్నారు. గత ఏడాది నవంబరు 20న స్థానిక రాజకీయ నేతలు ఒక్కటై కాలనీ వైపు కాలువ నిర్మించేందుకు రాగా, అడ్డుకున్న దళిత మహిళలను కొట్టి, కులం పేరుతో దూషించి దౌర్జన్యంగా కాలువలు నిర్మించారని తెలిపారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పట్టించుకోకుండా, కేసులు తప్పుదోవ పట్టించడం దారుణమన్నారు. సభ్యులు పీవీ రమణ, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన పెంచాలని చిరంజీవి పిలుపు



**సికింద్రాబాద్, పతాకం న్యూస్:** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ, కొన్ని కీలకమైన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. క్యాన్సర్‌పై పోరాటాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని చిరంజీవి వెల్లడించారు. తాను ఎంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తానని, అయినా ముందుజాగ్రత్తగా కోలనోస్కోపీ పరీక్ష చేయించుకున్నానని తెలిపారు. ఆ పరీక్షలో నాన్-క్యాన్సరస్ పాలిప్స్ కనపడటంతో వాటిని తొలగించారని చెప్పారు. అయితే, దీనిపై అవగాహన లేని కొందరు జర్నలిస్టులు తనకు క్యాన్సర్ వచ్చిందని, దాని నుంచి బయటపడ్డానని రాశారని, అది వాస్తవం కాదని స్పష్టం చేశారు. క్యాన్సర్‌గా మారే చిన్న అవకాశాన్ని కూడా తీసుకోకూడదనే ఉద్దేశంతోనే ఆ పరీక్ష చేయించుకున్నానని అన్నారు. అలాగే, తాను క్రమం తప్పకుండా పీఎస్‌ఏ (గూూూ) వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటానని తెలిపారు. శరీరం చెప్పే మాటను వినాలని, 'నాకు రాదులే' అనే నిర్లక్ష్యం పనికిరాదని చిరంజీవి గట్టిగా చెప్పారు. తన స్నేహితుడు ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడినా, తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్సతో బయటపడి గత పదేళ్లుగా ఆరోగ్యంగా జీవిస్తున్నారని ఉదహరించారు. జీవనశైలి, వాతావరణం, వంశపారంపర్య కారణాల వల్ల ఎవరికైనా క్యాన్సర్ రావొచ్చని, కానీ 90 శాతం కేసుల్లో తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చిరంజీవి కోరారు. 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ (నూాఎ) వ్యాక్సిన్ వేయిస్తే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (ఏవతీజఱఝశ్రీ ఝఱఅఏవతీ) బారిన పడకుండా 100 శాతం రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. 45 ఏళ్లలోపు మహిళలు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ సంబంధిత సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చని ఆయన అన్నారు. భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి నిమిషానికి ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చాలంటే పోలియో, మశూచి నిర్మూలన తరహాలో క్యాన్సర్‌పై కూడా ఒక ఉద్యమంలా పోరాడాలని పిలుపునిచ్చారు. పొగాకు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తనవంతు బాధ్యతగా భవిష్యత్తులో షార్ట్ ఫిలిమ్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని చిరంజీవి ప్రకటించారు. ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని కలిసిన కొద్దిరోజులకే కిమ్స్ నుంచి ఆహ్వానం రావడం దైవ సంకల్పంగా భావించానని, అందుకే వెంటనే అంగీకరించానని తెలిపారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలి



**డెంకాడ, పతాకం న్యూస్:** రోజువారీ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న తాము ఇళ్లు గృహా లు కోల్పోతున్నామంటే ఎంతో బాధగా ఉందని మండల కేంద్రంలోని ప్రజలు కన్నీరు పెట్టారు. డెంకాడలో రోడ్డు విస్తరణ, ఐటీ పార్కు అభివృద్ధి కోసం బలవంత పు భూసేకరణ ఆపాలని కోరుతూ వారు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడు తూ 20-40 యాక్షన్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణలో అనేకమంది తమ ఇళ్లు కోల్పోతు న్నారని, అదే విధంగా ఐటీ పార్కు అభివృద్ధి కోసం వందలాది ఎకరాల భూమిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రదీప్‌రాజు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పాణిరా జు, వైసీపీ నాయకుడు రొంగలి కనకసింహాచలం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సిరికి మహేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు కె.అప్పారావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



**బెలగాం, పతాకం న్యూస్:** పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందినవారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ జి.పోలిరాజు భార్యకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ నియామక పత్రాన్ని ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారి కుటుంబంలో అర్హత కలిగిన వారికి కారుణ్య నియామకం ద్వారా ప్రభుత్వం ఉద్యోగం కల్పిస్తోం దన్నారు. అందులో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ భార్య స్వాతికి పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ ప్రసంగానికి ముందే లోక్‌సభ వాయిదా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ గురువారానికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు.బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో సభ బుధవారంనాడు మూడు సార్లు వాయిదా పడింది. తొలుత సభ ప్రారంభ కాగానే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభ వాయిదా పడింది. దీంతో విపక్ష సభ్యులు పార్లమెంటు మెట్ల వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే మళ్లీ గందరగోళం తలెత్తింది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు సభలో సమాధానం ఇస్తానని కేంద్ర మంత్రి పీయూష్ గెయల్ చెప్పడంతో సభ రెండోసారి వాయిదా పడింది. తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగానే పీయూష్ గోయల్ మాట్లాడుతుండగా.. 8 మంది ఎంపీలను సమావేశాల నుంచి బహిష్కరించడంపై స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సాయంత్రం 5 గంటలకు సభ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తిరిగి సభ ప్రారంభమై మోదీ ప్రసంగించాల్సి ఉండగా దీనికి ముందే స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

# పోరంకి శ్రీచైతన్య విద్యార్థి ఆత్మహత్య ఘటనలో 12 మంది అరెస్టు



**కృష్ణా, పతాకం న్యూస్:** కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీ చైతన్య శారదా భవన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య కారణమైన 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్లో గన్నవరం డిఎస్‌పి చలసాని శ్రీనివాసరావు, పెనమలూరు సిఐ జె వెంకట రమణ ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టకు చెందిన మొల్లి పవన్ కుమార్ (17), తోటి విద్యార్థి హేమంత్ స్నేహంగా ఉండేవారు. గతేడాది డిసెంబరులో వారి మధ్య వివాదం తలెత్తింది. హేమంత్ మంచివాడు కాదని, అతనితో మాట్లాడవద్దని తోటి విద్యార్థులకు పవన్‌కుమార్ చెప్పాడు. ఈ నేపథ్యంలో హేమంత్‌తోపాటు కళాశాల హాస్టల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జనవరి 5వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పవన్ కుమార్ రూమ్‌కు వెళ్లి ఆయనను కొట్టారు. దీన్ని వీడియోతీసి ఇన్‌స్ట్రాలో పోస్టుచేశారు. జనవరి 30న మళ్లీ దాడి చేసి కొట్టారు. దీంతో మనస్తాపం చెందిన పవన్ కుమార్ జనవరి 31వ తేదీ సాయంత్రం స్టడీ అవర్‌కు వెళ్లకుండా తనను కొట్టి అవమానించిన ఆరుగురు విద్యార్థుల పేర్లను తన చేతి మణికట్టుపై రాసుకుని హాస్టల్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాల ప్రిన్సిపల్ పిచ్చయ్య, ఫ్లోర్ ఇన్ఛార్జి రవీంద్ర, మెస్ బారు హేమంత్, జూనియర్ లెక్చరర్లు రాజేష్, ఆనంద్, కృష్ణ సంఘటన స్థలానికి వెళ్లారు. విషయం బయటపడితే ఇబ్బంది పడతామన్న ఉద్దేశంతో రూమ్‌లో ఉన్న పిల్లలందరినీ బయటకు పంపించేసి పవన్‌కుమార్ చేతి మణికట్టుపై ఉన్న పేర్లను సిబ్బంది చెరిపేసి సాక్ష్యాలను మాయం చేయడానికి ప్రయత్నించారు. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఆత్మహత్యకు కారణాలను కళాశాల యాజమాన్యం గోప్యంగా ఉంచింది. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరపడంతో విషయాలు వెలుగుచూశాయి. ఆత్మహత్యకు కారణమైన ఆరుగురు విద్యార్థులను, సాక్ష్యాలు తారుమారు చేసిన కళాశాలకు చెందిన ఆరుగురి సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్‌పి చలసాని శ్రీనివాసరావు తెలిపారు. పవన్ కుమార్ మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని, మృతుని కుటుంబానికి కళాశాల యాజమాన్యం కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, ప్రజా సంఘాలు, బంగారుమెట్ట గ్రామస్తుల ఆధ్వర్యంలో అనకాపల్లిలోని శ్రీ చైతన్య కాలేజీ వద్ద ధర్నా నిర్వహించారు. పవన్ కుమార్‌ను శ్రీ చైతన్య కాలేజీలో చదువుతున్న సీనియర్ విద్యార్థులు దారుణంగా కొట్టి చంపారని తెలిపారు. ఈ ఘటనను కాలేజీ యాజమాన్యం ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ మృతుని కుటుంబీకులను తప్పుదోవపట్టిస్తోందన్నారు. విద్యార్థి ఘటనపై విద్యాశాఖ మంత్రి లోకేష్, హోం శాఖ మంత్రి అనిత చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే నిందితులను అరెస్టు చేశామని, ఘటనపై చర్చించేందుకు పోరంకి రావాలని శ్రీచైతన్య యాజమాన్యం, మృతుని బంధువులను అక్కడి పోలీసులు కోరారు. దీంతో వారు అక్కడకు బయలుదేరారు.

# వైసీపీ మహాపరాధం చేసింది: చంద్రమోహన్




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వం పామాయి ల్‌కు రసాయనాలు కలిపి నెయ్యిగా మార్చి దానితో తిరుమల లడ్డూ ప్రసాదం తయారు చేసి మహాపరాధానికి పాల్పడిందని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదని సిట్ ఎక్కడా నివేదిక ఇవ్వలేద న్నారు. లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యి అసలుది కాదని సిట్ తేల్చింద న్నారు. చుక్క పాలు కూడా కొనకుండా 20 కోట్ల లడ్డూలను ఎలా తయారు చేశారో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల నోటి దురుసు కారణంగానే దాడులు జరుగుతున్నాయని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై విషప్రచారం చేస్తే క్షమించేది లేదని హెచ్చరిం చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పేడాడ రామ్మోహన్, కణితి కిరణ్‌కుమార్, బలగ ప్రవీణ్‌కుమార్, పాత్రుని పాపారావు, భూపతి అర్జున్‌కు మార్, చిట్టి భాస్కర్, ముంగి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ఈ-కేవైసీ జరిగేలా చొరవ చూపాలి



**వజ్రపుకొత్తూరు, పతాకం న్యూస్:** పూర్తిస్థాయిలో ఈ-కేవైసీ జరిగేలా చొరవచూపాలని తహసీల్దార్ డీవీ సీతారా మయ్య కోరారు. ఉద్దానం మెళి యాపుట్టిలో జరుగుతున్న రైతుల పాస్ బుక్‌ల ఈ- కేవైసీ పక్రియను పరిశీ లించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాస్‌బుక్ లోఉన్న వివరాలు పరిశీలిం చాలని కోరారు. కార్యక్ర మంలో డీటీ శ్రావన్‌కు మార్, వీఆర్వో ఇందిరా ప్రయదర్శిని పాల్గొన్నారు

# 3 లక్షల ఎకరాల్లో వ్యవసాయం ఖాళీ!



**గుంటూరు, పతాకం న్యూస్:** రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా తాజాగా ప్రకటించిన విస్తరణ కార్యక్రమం రైతాంగంలో కలవరం సృష్టిస్తోంది. పెద్ద సంఖ్యలో వ్యవసాయ భూములు సాగుకు దూరంగా మారుతుండటమే దీనికి కారణం. గుంటూరు జిల్లాలోని గుంటూరు రూరల్, మంగళగిరి, మేడికొండూరు, పెదకాకాని, తాడికొండ మండలాల్లో, పల్నాడు జిల్లాలో అమరావతి, యడ్లపాడు, పెదకూరపాడు మండలాల్లోని 43 గ్రామాల్లో 1.54 లక్షల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం గత నెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాలతోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల భూమిలో వ్యవసాయం ఖాళీ కానుంది. ఇది కాకుండా, వివిధ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం కనీసం మరో లక్ష ఎకరాల భూమిని వ్యవసాయ కార్యక్రమాల నుండి మళ్లించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయమే దాదాపుగా మూడు లక్షల ఎకరాలపై ప్రభావం చూపుతుందని అంచనా!

ఇదే విషయాన్ని పేర్కొంటూ అధికారులు ఇటీవల ఒక నివేదిక రూపొందించినట్లు సమాచారం. దీంతో వ్యవసాయమే కీలకంగా మనుగడ సాగించే భూముల్లో దానికి స్థానం లేకుండా పోతుండటం రైతుల్లో చర్చనీయాంశంగా మారుతోంది. నిజానికి గత పదేళ్లగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూ వచ్చింది. 2015లో ఉమ్మడి జిల్లాలో సాగు భూమి విస్తీర్ణం 14 లక్షల ఎకరాలు. ఇందులో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కింద 22 వేల ఎకరాలు, సిమెంట్ ఫ్యాక్టరీల కోసం 12 వేల ఎకరాలు, వాన్‌పిక్ కోసం 22 వేల ఎకరాలు, రాజధాని నిర్మాణానికి మరో 34 వేల ఎకరాలు భూమిని సేకరించారు. వివిధ ప్రాజెక్టులతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఇతర నిర్మాణాల వల్ల సాగు విస్తీర్ణం 2020 నాటికి 12 లక్షలకు ఎకరాలకు తగ్గింది. జిల్లాల విభజన తర్వాత గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొత్తం సాగు భూమి పది లక్షల ఎకరాలుగా నిర్ధారించారు. 2025లో పల్నాడు జిల్లాలో ఆరు లక్షల ఎకరాల్లో, గుంటూరు జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. గత ఐదేళ్లలో దాదాపు లక్ష ఎకరాలు వ్యవసాయేతర అవసరాలకు ఖాళీగా ఉంచారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఈ రెండు జిల్లాలోనూ మరో మూడు లక్షల ఎకరాల భూమి వ్యవసాయానికి దూరం కానుందని అంచనా. గుంటూరు జిల్లాలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, పొన్నూరు,చేబ్రోలు మండలాల్లో మాత్రమే ప్రస్తుతం వ్యవసాయం ప్రధానంగా ఉంది. రానున్న రోజుల్లో ఈ మండలాల్లోకూడా వ్యవసాయ విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే తొలి విడతలో 34 వేల ఎకరాలు సమీకరించిన ప్రభుత్వం మలి విడతలో 44 వేల ఎకరాలను సమీకరించాలని గత ఏడాది జులైలో నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదట 16,666 ఎకరాల భూ సమీకరణకు ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. గ్రామసభలను నిర్వహించి రైతులను ఒప్పించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. . వీటితోపాటు అమరావతి రైల్వే ప్రాజెక్టు, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, గోదావరి-పెన్నా అనుసంధాన పథకం, రాజధానికి అవుటర్ రింగ్ రోడ్డు కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు 20 వేల ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లు ఇచ్చాయి. అవుటర్ రింగ్ రోడ్డుకు జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారులు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 39 గ్రామాల పరిధిలో దాదాపు ఎనిమిది వేల ఎకరాలను భూ సేకరణ ద్వారా తీసుకునేందుకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. రాజధాని అమరావతి ప్రకటన తర్వాత 2015లో తొలి విడత 34 వేల ఎకరాలను సమీకరణలో తీసుకోగా, మరో 17 వేల ఎకరాలు అసైన్డు, జుబేదారి, లంక, చెరువు, పోరంబోకు, ప్రభుత్వ భూములు రాజధానిలోని సిఆర్‌డిఎ పరిధిలోకి వెళ్లాయి. వీటన్నింటి ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో క్రమేణా సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

# లంకె బిందెల పేరిట టోకరా... దొంగ బాబా అరెస్ట్




**నిజామాబాద్, పతాకం న్యూస్:** మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని లక్షల్లో డబ్బులు దోచుకుంటున్న దొంగ బాబా గుట్టును కామారెడ్డి జిల్లా పోలీసులు రట్టు చేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొన్నాజీపేటకు చెందిన దుమ్మల్ల బీరవ్వ ఇంటికి కొద్ది రోజుల క్రితం వాస్తు పరిజ్ఞానం, అతీంద్రియ శక్తులు ఉన్నట్లు చెప్పుకుంటూ ఓ వ్యక్తి వచ్చాడు. ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని, వాటి వల్ల కుటుంబంలో అనారోగ్య సమస్యలు, అశాంతి పెరుగుతున్నాయని నమ్మబలికాడు. వాటిని తొలగించకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుందని భయపెట్టాడు. క్షుద్ర పూజలు నిర్వహించి లంకె బిందెలను తీసివేస్తామని నమ్మించి ఇందుకు రూ.8.20 లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. బాధిత కుటుంబం ఇటీవల కామారెడ్డిలో సదరు వ్యక్తిని కలసి డబ్బులు అందించింది. అయితే ఆ తర్వాత అతను ఫోన్ ఎత్తకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి ప్రధాన నిందితుడిగా సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన కడమంచి నర్సింలు అలియాస్ నర్సిరెడ్డిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.7 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు అనుచరులను త్వరలో పట్టుకుంటామని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. పోలీసుల విచారణలో నర్సింలు మరో ఇద్దరితో కలిసి ముఠా ఏర్పాటు చేసి, గుప్త నిధులు, క్షుద్ర పూజల పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లక్షల్లో వసూలు చేస్తున్నట్లు తేలింది. గతంలో కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన లాస్య అనే మహిళ ఇంటికి బిక్షాటన పేరుతో వెళ్లి, లంకె బిందెలు ఉన్నాయంటూ రూ.14 లక్షలు డిమాండ్ చేశాడని, ఆమె వద్ద రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. అప్పట్లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయగా, ఇదే తరహాలో పలు మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

నర్సింలుపై ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి కేసులు ఉన్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగ బాబాలు, మూఢనమ్మకాల పేరుతో భయపెట్టే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. క్షుద్ర పూజలు, లంకె బిందెల పేరుతో మోసాలకు పాల్పడేవారి మాటలను నమ్మవద్దని, ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# శ్రీముఖలింగంలో 15 నుంచి శివరాత్రి ఉత్సవాలు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉత్సవ ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఈ నెల 15 నుంచి 18 వరకు శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లు చేయాలి. చివరిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తాం. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వంశధార నదిలో తగినంత నీటినిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. అత్యవసర వైద్యసేవల కోసం 104, 108 వాహనాలను సిద్ధం చేయాలి. ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల'ని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ చక్రతీర్థ స్నానాల రోజు రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిఘాతోపాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామ'ని తెలిపారు. సమావేశంలో డీఆర్వో లక్ష్మణమూర్తి, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో ఏడుకొండలు, డీపీవో భారతీ సౌజన్య, ఇన్‌చార్జి ఆర్డీవో జయదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డా.అనిత, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు పాల్గొన్నారు.

# ధమనుల ఆరోగ్యం మెరుగు పడాలంటే.. వీటిని తీసుకోవాలి..!

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రక్తాన్ని సరఫరా చేసే ధమనులు కూడా ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం. ధమనుల నాళాల గోడల ఆరోగ్యం నైట్రిక్ ఆక్సైడ్ పై ఆధారపడి ఉంటుంది. తగినంత నైట్రిక్ ఆక్సైడ్ ఉన్నప్పుడు ధమనులు ఆరోగ్యంగా ఉంటాయి. మనం తీసుకునే ఆహారాల ద్వారా ధమనుల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. సహజంగా లభించే కొన్ని రకాల పానీయాలు ధమనుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు సహాయ పడతాయి. ఈ పానీయాలను తీసుకోవడం వల్ల ధమనుల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తపోటు అదుపులో ఉండడం, గుండె పనితీరు మెరుగుపడడం వంటి ప్రయోజనాలు కూడా మనకు కలుగుతాయి. ధమనుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని పానీయాల గురించి అలాగే వాటిని తయారు చేసుకునే విధానం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



బీట్‌రూట్ లో నైట్రేట్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోకి ప్రవేశించిన తరువాత నైట్రిక్ ఆక్సైడ్ గా మారుతుంది. ఇది ధమనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో, రక్తపోటును అదుపులో ఉంచడంలో ఎంతో సహాయపడుతుంది. ముఖ్యంగా వృద్దులు దీనిని తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. రోజుకు 200 నుండి 250 ఎమ్ఎల్ బీట్‌రూట్ తాజా మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల ధమనుల ఆరోగ్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

మందార టీ లో ఆంథోసయనిన్లు అధికంగా ఉంటాయి. మందార టీని తయారు చేసి తీసుకోవడం వల్ల ధమనుల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఒక కప్పు నీటిలో ఒక టీ స్పూన్ ఎండిన మందార రేకులు వేసి 5 నుండి 7 నిమిషాల పాటు బాగా మరిగించి వడకట్టాలి. తరువాత ఇందులో చక్కెరకు బదులుగా దాల్చిన చెక్క లేదా నిమ్మరసం వేసి కలిపి తాగాలి. రోజుకు 1 నుండి 3 కప్పుల మోతాదులో ఈ టీని తీసుకోవచ్చు.


చక్కెర లేకుండా కోకో పానీయాన్ని తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. ఎండోథెలియల్ పనితీరు మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గోరు వెచ్చని పాలు లేదా నీటిలో 1 నుండి 2 టీ స్పూన్ల కోకో పౌడర్ ను వేసి కలిపి తాగాలి. అయితే చక్కెరను, స్వీటెనర్లను తక్కువగా ఉపయోగించడం లేదా అస్సలు ఉపయోగించకపోవడం మంచిది.

ఉసిరి పానీయాన్ని తీసుకోవడం వల్ల ఎల్‌డిఎల్ స్థాయిలు, లిపిడ్ ప్రొఫైల్స్ నిష్పత్తిలో మెరుగుదల ఉంటుంది. దీంతో గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. కాలక్రమేణా ఇవి ధమనుల ఆరోగ్యానికి కూడా మద్దతును ఇస్తాయి. ఒక గ్లాస్ నీటిలో ఒకటి లేదా రెండు ఉసిరికాయల ముక్కలను వేసి బాగా మరిగించి వడకట్టి తాగాలి లేదా ఒక గ్లాస్ నీటిలో ఉసిరికాయ పొడిని వేసి బాగా కలిపి తాగాలి. అయితే దీనిలో చక్కెరను కలపకుండా తీసుకోవడం మంచిది.

నిమ్మకాయ నీరు, ఆలివ్ ఆయిల్ ని కలిపి తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు తగ్గుతుంది. వీటిని కలిపి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో ఉండే ఫినోలిక్స్, మోనోశాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ సి, ప్లేవనాయిడ్స్ ధమనుల ఆరోగ్యానికి, గుండెకు ఎంతో మద్దతును ఇస్తాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీ స్పూన్ ఆలివ్ నూనె, ఒక టీ స్పూన్ నిమ్మరసం వేసి కలిపి తాగాలి. ఈ విధంగా ఈ పానీయాలను తయారు చేసి తీసుకోవడం వల్ల ధమనుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండె సంబంధిత సమస్యలు కూడా రాకుండా ఉంటాయి. ఈ పానీయాలు మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

# చుండ్రు సమస్యను మిమ్ములను వేధిస్తుందా?

చుండ్రు.. జుట్టుకి సంబంధించిన సమస్య చాలా మందిని తెగ ఇబ్బంది పెట్టేస్తుంటుంది. ఇది చూడ్డానికి చిన్న సమస్యే అయినా.. తీనికి అనుగుణంగా మరికొన్ని సమస్యలు వచ్చేస్తుంటాయి. దురద, హెయిర్ లాస్ ఇది తీవ్రమైతే కాస్తా కిందకి చేరి మొటిమలు కూడా ఏర్పడతాయి. ఇంత తీవ్రంగా కాకముందే ఈ డాండ్రఫ్‌ని తగ్గించుకోవడం మంచిది. ఇందుకోసం కొన్ని ఇంటి చిట్కాలను చూసేద్దాం.. చుండ్రు.. జుట్టుకి సంబంధించిన సమస్య చాలా మందిని తెగ ఇబ్బంది పెట్టేస్తుంటుంది. ఇది చూడ్డానికి చిన్న సమస్యే అయినా.. తీనికి అనుగుణంగా మరికొన్ని సమస్యలు వచ్చేస్తుంటాయి. దురద, హెయిర్ లాస్ ఇది తీవ్రమైతే కాస్తా కిందకి చేరి మొటిమలు కూడా ఏర్పడతాయి. ఇంత తీవ్రంగా కాకముందే ఈ డాండ్రఫ్‌ని తగ్గించుకోవడం మంచిది. ఇందుకోసం కొన్ని ఇంటి చిట్కాలను చూసేద్దాం.. చుండ్రు సమస్యని పోగొట్టుకోవాలంటే ముందుగా జుట్టుని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. అందుకే వారానికి రెండు లేదా మూడు సార్లు తలస్నానం చేస్తుండాలి. లేకపోతే జుట్టులో తేమ చేరి అది చుండ్రుకి కారణం అవుతుంది. కాబట్టి తలస్నానం చేస్తుండాలి.అదే విధంగా తలను కొంతమంది కప్పి ఉంచుతుంటారు. కానీ, ఇలా కేవలం బయటికి వెళ్లినప్పుడు, పొల్యూషన్‌లో ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. ఎప్పుడూ చేయడం వల్ల తలలో తేమ శాతం పెరుగుతుంది. జిడ్డుగా మారి చుండ్రు సమస్య పెరుగుతుంది. దీన్ని తర్వాత ఎంత షాంపూ చేసినా, కండీషనర్ రాసినా సమస్య తగ్గదు. కాబట్టి అప్పుడప్పుడూ తలకి గాలి తగిలేలా చూసుకోండి. దీని వల్ల జుట్టు పొడిగా ఉంటుంది. ఇక మరో ముఖ్య విషయం ఏంటంటే.. చాలా మంది కూడా ఇంట్లో అందరూ ఒకే దువ్వెనతో తల దువ్వుకుంటారు. కానీ, ఇలా చేయడం అంత మంచిది కాదు.. ఎవరికీ వారు సెపరేట్ దువ్వెనలు వాడండి. ఎందుకంటే కొన్ని సార్లు ఒకరి తలలో ఉండె ఇన్‌ఫెక్షన్స్, వైరస్‌లు దువ్వెనల ద్వారా ఇతరలకు వ్యాపిస్తాయి. కాబట్టి ఎవరికీ వారు వేర్వేరుగా దువ్వెనలు వాడడం అలవాటు చేసుకోవడం మంచిది. అదే విధంగా.. టవల్స్ కూడా సెపరేట్‌గా ఉండడం మంచిది. దీని వల్ల సమస్య త్వరగా తగ్గుతుంది.కాసింత బేకింగ్ సోడాని తీసుకుని తడి జుట్టుకి బాగా రాయాలి.. ఇలా రెండు నిమిషాల పాటు బాగా మర్దనా చేసి ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఇలా 15 రోజులకి ఓసారి చేయడం వల్ల చుండ్ర సమస్య తగ్గిపోతుంది. అయితే, మరీ ఎక్కువగా బేకింగ్ సోడాను వాడొద్దు. కాసింత పరిమాణంలోనే తీసుకోవడం మంచిది. వెనిగర్‌తోనూ ఈ సమస్యని తగ్గించు కోవచ్చు. అందుకోసం ఆరు చెంచాల నీటిలో 2 చెంచాల వెనిగర్ కలిపాలి. ఇప్పుడు షాంపూతో తలస్నానం చేశాక ఆ నీటితో తలని కడగాలి. వారానికి ఓ సారి ఇలా చేయడం వల్ల త్వరలోనే చుండ్రు సమస్య తగ్గిపోతుంది.పుల్లగా ఉండే పెరుగులో నిమ్మరసంలు కలిపి తలకు రాయాలి. ఆరాక తలస్నానం చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తుంటే తలలోని చుండ్రు దూరమవ్వడమే కాకుండా జుట్టు కూడా కాంతులీనుతూ ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌తో కూడా చుండ్రు సమస్యని తగ్గించుకోవచ్చు. రెండు స్పూన్ల యాపిల్ సిడర్ వెనిగర్‌ని షాంపూ లేదా కొబ్బరినూనెలో కలిపి రాయాలి. ఇలా చేసిన తర్వాత ఇబ్బంది లేదనుకుంటే రాత్రంతా



# త్వరలో పోర్టులో నౌకల రాకపోకలు చూసేందుకు నగరవాసులకు అవకాశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం పోర్టు నూరు వసంతాలకు చేరువవుతోంది. ప్రస్తుతం పోర్టుకు 93 ఏళ్లు. పోర్టుతో పాటే విశాఖ నగరమూ అభివృద్ధి చెందుతోంది. పోర్టులో ఏమి జరుగుతున్నదో చూడాలంటే మాత్రం సామాన్యులకు సాధ్యం కాదు. అనుమతి లభించదు. ఇకపై పోర్టు పరిసరాలను సామాన్య ప్రజలు కూడా సందర్శకుల్లా చూడడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్రూయిజ్ టెర్మినల్ సమీపానే రూ.16 కోట్లతో ప్రమోనేడ్ (ప్రజా విహార ప్రాంగణం) నిర్మిస్తున్నారు. గత ఏడాది జూలైలో శంకుస్థాపన చేసుకున్న ఈ ప్రాజెక్టు త్వరలోనే పూర్తి కానున్నది. దేశ విదేశాల నుంచి సముద్ర మార్గం ద్వారా వచ్చే నౌకలు పోర్టులో ప్రవేశించి జెట్టీల్లో సరకులను అన్‌లోడింగ్ చేస్తాయి. ఆయిల్ ఉత్పత్తులు, పప్పు దినుసులు, రసాయనాలు, బొగ్గు, జీడిపిక్కలు, ఖనిజాలు అనేకం దిగుమతి అవుతుంటాయి. ఇక్కడి నుంచి ఐరన్‌ఓర్, సముద్ర ఉత్పత్తులు, ఫెర్రో ఎల్లాయిస్, అల్యూమినా, పెట్రో ఉత్పత్తుల వంటివి ఎగుమతి అవుతాయి. ఏటా వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. పోర్టులో ఇన్నర్ హార్బర్, అవుటర్ హార్బర్‌తో పాటు సుమారుగా 30 బెర్తులు ఉన్నాయి. ఇవి ఒక్కోసారి ఖాళీ లేక నౌకలు ఆన్‌రోడ్స్ (పోర్టుకు దూరంగా సముద్రంలో)లోనే రెండు, మూడు రోజులు ఉండిపోతాయి. నౌకల నుంచి దిగుమతి చేసిన సరకులను ఇతర ప్రాంతాలకు రోడ్డు, రైలు మార్గాల ద్వారా పంపేంతవరకు నిల్వ చేయడానికి ఓపెన్ యార్డులను ఉపయోగించుకుంటారు. మరికొన్ని సరుకులను గోదాముల్లో నిల్వ చేస్తారు. వీటి కోసం వందలాది ఎకరాల్లో గోదాములు ఉన్నాయి. అక్కడ కాలుష్యం ఎక్కువ. వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. ఈ ప్రాంతంలో సెక్యూరిటీ ఉంటుంది.

అందుకే ఎవరినీ అనుమతించరు. ప్రముఖులు ఎవరైనా వస్తే పోర్టు లాంచీలో ఇన్నర్ హార్బర్ అంతా చూపిస్తుంటారు. పోర్టులోకి వచ్చే నౌకల రాకపోకలను చూసే అవకాశం నగర ప్రజలకు కల్పించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందు కోసం ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ భవనం సమీపాన సుమారుగా రెండు కి.మీ. పొడవున సముద్రం తీరం వెంబండి వాకింగ్ ట్రాక్ మాదిరి నిర్మాణం చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ మాదిరిగా ఈ నిర్మాణం ఉంటుంది. సందర్శకులు కూర్చోవడానికి, అక్కడక్కడ పార్కులు, పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టికెట్ పెట్టి సందర్శకులను అనుమతించాలని భావిస్తున్నారు. ఆ ట్రాక్ వెంబడి నడుస్తూ పోర్టులో వచ్చీ, పోయే నౌకలను చూసే అవకాశం మాత్రమే లభిస్తుంది. రెండు, మూడు వారాల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయని పోర్టు డిప్యూటీ ఛైర్మన్ రోష్ని అపరంజి తెలిపారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత



**మణిపూర్:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ముగిసింది. ఈ మేరకు రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ కేంద్ర హోం శాఖ గెజిట్ విడుదల చేసింది. ఆర్టికల్ 356 (2) ప్రకారం రాష్ట్రపతి తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించింది. మణిపూర్ నూతన సీఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. మరోవైపు మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ సాయంత్రం 6గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. మణిపూర్ ఎన్‌డీఏ శాసనసభాపక్ష నేతగా ఆయన ఎన్నికయ్యారు. దిల్లీలోని మణిపుర్ భవన్‌లో మంగళవారం రాష్ట్ర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల భేటీ జరిగింది. దీజ్రీ, చ్రీరా, చ్రీఖీ ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు స్వతంత్ర మీాూలు హాజరయ్యారు. వారంతా ఖేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. అంతకుముందు మంగళవారం మణిపుర్ బీజేపీ ఎమ్మెల్యేలు దిల్లీలోని తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమై ఖేమ్‌చంద్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా, మిగిలిన బీజేపీ శాసన సభ్యులందరూ హాజరయ్యారు. ఆ సమావేశంలో మాజీ సీఎం ఎన్.బీరెన్ సింగ్, అసెంబ్లీ స్పీకర్ సత్యబ్రత సింగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు ఎ.శారదా దేవి, కేంద్ర పరిశీలకు తరుణ్ చుగ్, సంబిత్ పాత్రా పాల్గొన్నారు.మైతేయ్ వర్గానికి చెందిన ఖేమ్?చంద్ సింగ్ 2017, 2022లో వరసుగా రెండు సార్లు సింగ్జమేయి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తైక్వాండోలో ప్రావీణ్యమున్న ఖేమ్‌చంద్, 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల తరువాత బీరెన్ సింగ్ తన మంత్రివర్గంలోకి ఖేమ్‌చంద్‌ను తీసుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, గృహ నిర్మాణం, విద్య సహా పలు కీలక శాఖల మంత్రిగా పనిచేశారు. రాష్ట్రపతి పాలన విధించే వరకు ఆయన ఆయా శాఖల మంత్రిగా కొనసాగారు. మణిపుర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం ఖేమ్‌చంద్‌కు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.




## ప్లేయర్లు ఆడొద్దని బోర్డు చెప్పడం సమంజసం కాదు: కపిల్ దేవ్



టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ అంశం ప్రస్తుతం తీవ్ర చర్చకు దారి తీసింది. టోర్నీలో పాల్గొంటాం కానీ భారత్‌తో మాత్రం ఇప్పుడే కాదు ఇంకెప్పుడు మ్యాచులు ఆడబోమని పీసీబీ ప్రకటించింది. దీనిపై ఐసీసీ తీవ్రంగా స్పందించి పాకిస్థాన్ బోర్డును హెచ్చరించినా.. ఆ దేశం మొండి వైఖరినే ప్రదర్శిస్తోంది. గ్రూప్ స్టేజిలో భారత్–పాక్ మ్యాచ్ కొలంబో వేదికగా ఫిబ్రవరి 15న జరగాల్సి ఉంది. అయితే పాకిస్థాన్ నిర్ణయాన్ని టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్(ఖుజూఅశ్రీ ఐవజ) తప్పు బట్టాడు. 'ఒకవేళ ఈ నిర్ణయం ఆటగాళ్లు తీసుకుంటే వాళు ముందుకు వచ్చి చెప్పొచ్చు. కానీ ఆటగాళ్లు ఆడకూడదని బోర్డు నిర్ణయం తీసుకుంటే దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ఈ నిర్ణయం పాక్ ప్రగతికి ఏ మాత్రం దోహదపడదు. వారు పాక్ క్రికెట్‌ను చంపేస్తున్నారు. ప్రపంచ కప్ ఆడకుండా క్రికెటర్లను అడ్డుకోవడం సమంజసం కాదు. వారి సొంత ఆటగాళ్లకే వారు అన్యాయం చేసినట్లవుతుంది' అని కపిల్ దేవ్ పేర్కొన్నాడు. ఒకవేళ గ్రూప్ స్టేజిలో పాక్.. భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే నెట్ రన్ రేట్ పరంగా వెనకబడుతుంది. మ్యాచ్ పాయింట్లు కూడా భారత్‌కు వస్తాయి. దీంతో మెగా టోర్నీలో పాక్ ముందుకుసాగలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థికపరంగానూ పాక్ క్రికెట్ బోర్డు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఈ వైఖరినే కొనసాగిస్తే పాక్.. ఐసీసీ నుంచి నిషేధాన్ని కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది.

## డబ్ల్యూపీఎల్ ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్




డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్ మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వడోదర వేదికగా గుజరాత్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ 15.4 ఓవర్లలో ఛేదించి వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు చేరింది. దిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది గుజరాత్‌ను జెయింట్స్.? 7 వికెట్ల కోల్పోయి 168 పరుగులు చేసింది. దిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభంలోనే గుజరాత్?కు పెద్ద షాక్ తగిలింది. రెండో ఓవర్?లోనే ఓపెనర్ సోఫీ డివైన్?ను పెవిలియన్?కు చేర్చింది షినెలి హెన్రీ. దీంతో సోఫీ ఆరు పరుగులకే వెనుదిరిగింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ నిలిచింది. కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని శర్మ వరుస బంతుల్లో పెవిలియన్?కు చేర్చింది. 9వ ఓవర్లో కనికను మిన్ను మణి వెనక్కి పంపింది. దీంతో 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేయగలిగింది గుజరాత్.

అయితే వికెట్లు పోతున్నా మూనీ మాత్రం గ్రీజులో నిలిచింది. కానీ దిల్లీ బౌలర్ల కట్టడికి ధీటుగా ఆడలేకపోయింది. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ జోడి కుదరింది. దీంతో ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేసింది. అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో వేర్‌హామ్ వెనుదిరిగే సమయానికి గుజరాత్ స్కోరు 120. వెంటనే ఫుల్మాలి కూడా ఔట్ అయ్యింది. కష్వీ గౌతమ్‌తో కలిసి మూనీ జట్టు స్కోరు 160 దాటించింది. ఏడో వికెట్‌కు మూనీతో కలిసి 39 పరుగులు జోడించిన కష్వీ ఆఖరి ఓవర్లో నిష్క్రమించింది. మూనీ, కష్వీ బ్యాట్లు ఝుళిపించడంతో ఆఖరి రెండు ఓవర్లలో గుజరాత్‌కు 61 పరుగులొచ్చాయి.

169 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన దిల్లీ 15 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించింది. దిల్లీ బ్యాటర్లపై గుజరాత్ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. బౌండరీల మోత మోగించిన ఓపెనర్లు లిజెలీ, షెఫాలి 21 బంతుల్లో ఏడు ఫోర్లు కొట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లిజెలి మూడు ఫోర్లు, షెఫాలి రెండు ఫోర్లు బాదడంతో ఓ ఓవర్లో రేణుక 21 పరుగులు సమర్పించుకుంది. దిల్లీ 7 ఓవర్లకే 89 పరుగులు చేసింది. జార్జియా వేర్‌హామ్ వేసిన తర్వాతి ఓవర్లోనే ఓపెనర్లు ఇద్దరూ పెవిలియన్?కు చేరారు. వోల్వార్ట్ 24 బంతుల్లో 32 పరగులు చేసి నాటౌట్?గా నిలిచింది. జెమీమా రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించి, దిల్లీని విజయం వైపు నడిపించారు. షాట్లతో అలరించిన జెమీమా 15వ ఓవర్లో ఔట్ అయ్యింది. మరిజేన్‌తో కలిసి వోల్వార్ట్ మ్యాచ్?ను పూర్తి చేసింది. 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. దిల్లీ డబ్ల్యూపీఎల్ తొలి మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా, కప్పు గెలవలేకపోయింది. ఈసారైనా విజేతగా నిలుస్తుందో లేదో చూడాలి.




# ఒటీటీలోకి వస్తున్నా.. 'మన శంకర వరప్రసాద్ గారు'



ఈసారి సంక్రాంతి బరిలో మెగాస్టార్ సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు' బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు రికార్డులను కొల్లగొడుతూ భారీ కలెక్షన్లు రాబట్టింది. ఇప్పటి వరకు ఈ సినిమా కలెక్షన్లు రూ.400 కోట్ల మార్క్ ను చేరినట్లు సమాచారం. ప్రాంతీయ సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన మూవీగా 'మన శంకరవప్రసాద్ గారు' రికార్డుల కెక్కింది. సినిమా విడుదలై మూడు వారాలు గడుస్తున్నా కలెక్షన్లు మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కిన ఈ సినిమాకు మొదటి షో నుంచే మంచి టాక్ వచ్చింది. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో హీరోయిన్ గా నయనతార నటించింది. అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ కూడా ఈ సినిమాలో కనిపించారు.

క్యాథరీన్ థెరీసా, సచిన్ ఖేద్కర్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠం, శరత్ సక్సేనా తదితరులు వివిధ పాత్రల్లో నటించారు. థియేటర్లలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జీ 5 సొంతం చేసుకుంది. ఈ నెల 11 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# మార్చి 26న థియేటర్స్‌లో.. 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది.

'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబోలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల తేదీని ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో పవన్ సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనుంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విడుదల తేదీని ప్రకటించడంతో పవర్ స్టార్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు.

# ఏప్రిల్ 3న విడుదల కానున్న 'బైకర్'

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'బైకర్' కొత్త విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను ఏప్రిల్ 3న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "ఇంజిన్ స్టార్ట్ అయింది. ట్రాక్ సిద్ధంగా ఉంది. ఇక అతడిని ఆపలేరు" అంటూ క్యాప్షన్ జోడించింది.



వాస్తవానికి ఈ చిత్రాన్ని గత ఏడాది డిసెంబర్ 6న విడుదల చేయాలని ముందుగా భావించారు. అయితే, ప్రేక్షకులకు ఒక సాధారణ సినిమాను కాకుండా, మునుపెన్నడూ చూడని గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని 3డి, 4డిఎక్స్ వంటి అధునాతన ఫార్మాట్లలో కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శర్వానంద్ ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్‌గా కనిపించనున్నారు. సినిమాలోని రేసింగ్ సన్నివేశాలు, స్టంట్స్ ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తాయని చిత్ర యూనిట్ చెబుతోంది. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శర్వానంద్‌కు జోడీగా మాళవిక నాయర్ నటిస్తోంది. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, జె. యువరాజ్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 90వ దశకం, 2000ల ఆరంభం నాటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో మూడు తరాల కుటుంబ కథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**